సాక్షి
నిజామాబాద్

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



కమనీయం.. కల్యాణం

డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

- 8లో ▸



వృద్ధులను ప్రేమతో..

తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ప్రేమతో ఆదరించాలని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.3 /17.2

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

హెచ్‌పీఏఐ వైరస్‌పై జిల్లాకు అలర్ట్

- బయో సెక్యూరిటీపై పౌల్ట్రీ రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశాలు
- కలెక్టర్‌లకు లేఖరాసిన పశుసంవర్ధకశాఖ

డొంకేశ్వర్(ఆర్మూర్): దేశ వ్యాప్తంగా అధిక వ్యాధికారక ఏవియన్ ఇన్‌ఫ్లూ ఎంజ (హెచ్‌పీఏఐ) వైరస్ కారణంగా పౌల్ట్రీ కోళ్ల మృతి చెందుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది. నిజామాబాద్, కామారెడ్డితోపాటు పలు జిల్లాలో కూడా వైరస్ ప్రభావంతో ఇప్పటికే దాదాపు 65 వే లకు పైగా బ్రాయిలర్ కోళ్ల మృత్యువాత పడ్డాయి. వైరస్ వ్యాప్తిని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాసింది. పౌల్ట్రీ పరిశ్రమలను రక్షించడానికి కోళ్ల ఫారా ల రైతులకు బయో సెక్యూరిటీ చర్యలపై పశువైద్యాధికారులతో అవగాహన కల్పించాలని ఆదేశాలు ఇచ్చింది. పౌల్ట్రీలోకి బయటి వ్యక్తులను రానివ్వొద్దని, ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని సూచించింది. మృతి చెందిన కోళ్లను పౌల్ట్రీ నుంచి తొలగించి దూరంగా గొయ్యి తీసి పాతిపెట్టాలని, అలాగే వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు అటవీ, పోలీసు, వైద్యారోగ్య శాఖలతో సమావేశం నిర్వహించి తగిన సూచనలు చేయాలని పేర్కొంది.

అన్ని రకాల మందులు ఇవ్వాలి



ఇందల్వాయి: చికిత్స కోసం వచ్చే రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు ఇవ్వాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ వైద్యులకు సూచించారు. ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. బాలింతలు, గర్భిణులకు చేస్తున్న రక్త పరీక్షల వివరాలను ల్యాబ్ టెక్నీషియన్ అనిత రాథోడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిని శుభ్రంగా ఉంచాలని అటెండర్లను ఆదేశించారు. కాలం చెల్లిన మందులు ఉంటే వెంటనే తొలగించాలని ఫార్మసిస్ట్ విజయలక్ష్మికి సూచించారు. డీఎంహెచ్‌వో వెంట వైద్యాధికారి సుశాంత్‌రెడ్డి, ఆయుష్ వైద్యురాలు భువన, ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

మరింత సులభంగా విద్యుత్ సర్వీసుల మంజూరు

- దరఖాస్తుపై ప్రతి దశలో వినియోగదారుడికి మెస్సేజ్‌లు

సుభాష్‌నగర్: వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడంలో భాగంగా కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరును మరింత సులభతరం చేశామని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ ఆర్ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త సర్వీసు మంజూరు చేసే సమయంలో ఏదైనా కారణంతో దరఖాస్తు తిరస్కరించకుండా వినియోగదారుడు తగిన విధంగా స్పందించడానికి మరో అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దరఖాస్తుపై వినియోగదారుడికి ప్రతి దశలో మెసేజ్‌లు వెళ్తాయని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా వినియోగదారుడికి పారదర్శకత, జవాబుదారీతనం, సంతృప్తి, నమ్మకం కలుగుతుందని పేర్కొన్నారు. అలాగే తన అప్లికేషన్ స్థితిని తెలుసుకునేందుకు ట్రాకింగ్ చేసే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. 1912కి కాల్ చేసి వినియోగదారుడు సమాచారం తెలుసుకునే అవకాశం ఉంటుందని ఎస్‌ఈ వివరించారు.

ప్రయోగ పరీక్ష కేంద్రాల తనిఖీ



నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల విద్యార్థులకు రెండో స్పెల్ ప్రయోగ పరీక్షలు కొనసాగుతున్న సెంటర్లను జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఇందల్‌వాయి మోడల్, వెక్టార్, ఎస్సార్ జూనియర్ కళాశాలలతోపాటు ధర్మారంలోని సాంఘిక సంక్షేమ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాలలను డీఐఈవో తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దీన్ అస్లామ్, కనకమహాలక్ష్మి, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు మరో 10 కేంద్రాలను తనిఖీ చేశారు.



ఎమ్మెల్సీ అభ్యర్థుల

నంబర్ గేమ్

- పట్టభద్రుల ఓటర్ల సంఖ్యను బట్టి ఆయా జిల్లాల్లో ప్రచారానికి ప్రాధాన్యత
- కరీంనగర్ జిల్లాపైనే ఎక్కువ ఫోకస్
- అనుకూలమైన ఓట్లపై లెక్కలేసుకుంటున్న ప్రధాన పార్టీలు
- అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న స్వతంత్ర అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు, ఇతర అభ్యర్థులు నంబర్ గేమ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకు తగ్గట్లుగా ప్రణాళికలు తయారు చేసుకుని అమలు చేస్తున్నారు. ఓటర్ల సంఖ్యపై లెక్కలు వేసుకుంటూ ముందుకు వెళుతున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా పట్టభద్రుల ఓట్లు 1,60,260 ఉన్నాయి. తరువాత మెదక్ ఉమ్మడి జిల్లాలో 77,781 ఓట్లు, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో 69,134 ఓట్లు, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో 47,984 ఓట్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీల తరఫున బరిలోకి దిగిన అభ్యర్థులు ఆయా జిల్లాల్లో ఉన్న ఓట్ల సంఖ్యకు అనుగుణంగా పావులు కదిపేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. కాంగ్రెస్ తరఫున పోటీలో ఉన్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి కరీంనగర్ కావడంతో ఇది తనకు కలిసొస్తుందని ధీమాగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ సైతం ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని నరేందర్‌రెడ్డికి టిక్కెట్టు ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నరేందర్‌రెడ్డి కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి తనకు అత్యధికంగా ఓట్లు వస్తాయని లెక్కలు వేసుకుంటున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. తరువాత వరుసగా ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్ జిల్లాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చివరి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది. బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి సైతం కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాలపైనే ఎక్కువగా ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉండడంతో పాటు సంఘ్ పరివార్ శ్రేణులు చూసుకుంటాయిలే అన్న ధీమాతో వ్యవహరిస్తున్నట్లు సమాచారం. తక్కువ ఓట్లు ఉండడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాపై ప్రధాన పార్టీల అభ్యర్థులు చిన్నచూపు చూస్తున్నారని పలువురు అంటున్నారు.

ఈ నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలో ఈ రెండు పార్టీల శ్రేణులు సైతం తాము ఎక్కువగా రిస్క్ తీసుకోవాల్సిన అవసరం లేదనే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా స్వతంత్రులుగా బరిలోకి దిగిన వారిలో వివిధ రంగాల్లో పనిచేసిన వారున్నారు. పరిచయాలు ఎక్కువగా ఉండడంతో తమ జిల్లాల్లో గణనీయమైన ఓట్లు సాధించేందుకు కష్టపడుతున్నారు. ఉపసంహరణ రోజునాటికి పరిస్థితి ఏవిధంగా ఉంటుందో చూడాలని పట్టభద్రులు ఆసక్తిగా ఉన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల తుదిజాబితా విడుదల

నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు తుది జాబితాను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం విడుదల చేశారు. గత నెల 30న ఓటరు జాబితా ప్రచురించినప్పటికీ మళ్లీ ఓటు నమోదుకు అవకాశం కల్పించి తుది జాబితాను విడుదల చేశారు.

ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో పట్టభద్రుల ఓటర్లు

కుమురంభీం ఆసిఫాబాద్	6137
మంచిర్యాల	30921
ఆదిలాబాద్	14935
నిర్మల్	17141
నిజామాబాద్	31574
కామారెడ్డి	16410
జగిత్యాల	35281
పెద్దపల్లి	31037
కరీంనగర్	71545
రాజన్న సిరిసిల్ల	22397
సంగారెడ్డి	25652
మెదక్	12472
సిద్దిపేట	32589
హన్మకొండ	4585
జయశంకర్ భూపాలపల్లి	2483
మొత్తం	355159

■ నామినేషన్ల పరిశీలన మంగళవారం జరుగనుంది. ఈ నెల 13 వరకు ఉపసంహరణకు గడువు ఉంది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో ప్రభావం చూపే స్వతంత్ర అభ్యర్థులకు డబ్బులిచ్చి ఉపసంహరణ చేయించేందుకు రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు వేగంగా పావులు కదుపుతున్నట్లు చర్చ నడుస్తోంది.

ఉపాధ్యాయ ఓటర్లు

రెవెన్యూ డివిజన్	మండలాలు	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	మహిళలు	మొత్తం
నిజామాబాద్	10	10	1054	947	2001
బోధన్	10	10	391	310	701
ఆర్మూర్	13	13	731	318	1049
మొత్తం	33	33	2176	1575	3751

పట్టభద్రులు

రెవెన్యూ డివిజన్	మండలాలు	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	మహిళలు	మొత్తం
నిజామాబాద్	10	21	8816	5525	14341
బోధన్	10	11	3316	1721	5037
ఆర్మూర్	13	16	7861	4335	12196
మొత్తం	33	48	19993	11,581	31574

ఆఖరిరోజు అట్టహాసంగా..



భారీ ర్యాలీగా మంత్రులు, పీసీసీ చీఫ్‌తో కలిసి నామినేషన్ వేయడానికి వెళ్తున్న నరేందర్‌రెడ్డి



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేయడానికి వెళ్తున్న మల్క కొమురయ్య

- ముగిసిన గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ నామినేషన్లు
- ఒకేరోజు నామినేషన్ వేసిన 59 మంది అభ్యర్థులు
- రెండుస్థానాలకు కలిపి మొత్తం 117 దాఖలు
- ప్రధాన పోటీదారులంతా మిలియనీర్లే
- రూ.120 కోట్ల వ్యక్తిగత ఆస్తులతో ముందంజలో అంజిరెడ్డి

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్- మెదక్- ఆదిలాబాద్- నిజామాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ ప్రక్రియ ముగిసింది. సోమవారం నామినేషన్లకు ఆఖరురోజు కావడంతో భారీగా అభ్యర్థులు పోటెత్తారు. అనుచరులు, కార్యకర్తలు వెంటరాగా వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. చివరిరోజు 59 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో 51 గ్రాడ్యుయేట్స్ కోసం రాగా.. మిగిలిన 8 టీచర్స్ స్థానానికి వచ్చినట్లు వివరించారు. మూడో తేదీన మొదలైన నామినేషన్లలో ఇప్పటి వరకు గ్రాడ్యుయేట్స్‌కు 100, టీచర్స్ ఎమ్మెల్సీకి 17 నామినేషన్లు వేసినట్లు తెలిపారు.

✤ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి రెండోసెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, విప్‌లు ఆదిశ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఉన్నారు.

✤ ప్రసన్న హరికృష్ణ బీఎస్పీ నుంచి, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, ట్రస్మా శేఖర్‌రావు స్వతంత్రులుగా నామినేషన్ వేశారు. రవీందర్‌సింగ్ కేసీఆర్ చిత్రపటంతో వెళ్లి నామినేషన్ వేయడం గమనార్హం. బీఆర్‌ఎస్‌కు చెందిన వీరిద్దరూ స్వతంత్రులుగా బరిలోకి దిగడం విశేషం.

✤ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎస్టీయూ, టీపీఆర్టీయూ బలపరిచిన సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్, ఉపాధ్యాయ అధ్యాపక సంఘాలు బలపరిచిన వై అశోక్‌కుమార్ నామినేషన్లు వేశారు.

బరిలో మిలియనీర్లే..

చిన్నమైల్ అంజిరెడ్డి
వ్యక్తిగత ఆస్తులు:
రూ.120,40,41,274
భార్య ఆస్తులు :
రూ.54,79,63023
మొత్తం రూ.175 కోట్లపై చిలుకు
బంగారం వ్యక్తిగతం: 250 గ్రాములు (విలువ రూ.19.32 లక్షలు)
భార్య పేరిట 1,850 గ్రాములు (విలువ రూ.1.43 కోట్లు)

అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి
వ్యక్తిగత ఆస్తులు:
రూ.30,00,59,840
భార్య పేరిట: రూ.13,38,36,263
(ఆయన భార్యకు క్రిస్టా కారు, అరకిలో బంగారం)
ఉమ్మడి ఆస్తులు రూ. రెండు కోట్లు
మొత్తం రూ.45.50 కోట్లు

మల్క కొమురయ్య
వ్యక్తిగత ఆస్తులు:
రూ.32,08,62,420,
ఆయన భార్యకు:
రూ.29,55,03,158
మొత్తం కలిపి: రూ.61,63,65,578
భార్య వద్ద 4,457 గ్రాముల బంగారం



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేయడానికి వెళ్తున్న ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి



ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నామినేషన్ వేయడానికి వెళ్తున్న వై అశోక్‌కుమార్

దారులన్నీ కుంభమేళా వైపే..

- జిల్లా నుంచి తరలివెళ్తున్న భక్తులు
- ట్రాఫిక్ జామ్‌తో ఇక్కట్లు.. అధిగమిస్తూ పయనం
- 15 రోజుల్లో ముగియనున్న ఆధ్యాత్మిక జాతర



ఆర్మూర్ పట్టణం నుంచి మహాకుంభమేళాకు బస్సులో వెళ్తున్న న్యాయవాదులు

ఆర్మూర్: మహాకుంభ మేళాకు జిల్లా నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివెళ్తున్నారు. మహా కుంభమేళాలో అమృతస్నానం ఆచరించేందుకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు భక్తుల వాహనాలు లైన్ కట్టాయి. 990 కిలోమీటర్ల దూరంలోని ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్న భక్తులు త్రివేణి సంగమంలో అమృత స్నానానికే పరిమితం కాకుండా ఆధ్యాత్మిక పర్యటనగా మార్చుకుంటున్నారు. అయోధ్య, కాశీ, చిత్రూట్, మైహర్ శక్తిపీఠంను దర్శించుకుంటున్నారు. జనవరి 13న ప్రారంభమైన మహాకుంభ మేళా ఈనెల 26 నాటితో ముగియనుంది. గత నెల 29న మౌని అమావాస్య, ఈ నెల 3న వసంత పంచమి సందర్భంగా కోట్లాది మంది తరలి వస్తారనే సమాచారం ఉండటంతో.. ఈ పర్వదినాల అనంతరం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కుంభమేళాకు వెళ్లడం ప్రారంభించారు. మరో 15 రోజుల్లో మహా కుంభమేళా ముగియనుంది. లక్షలాది వాహనాలు ప్రయాగ్‌రాజ్‌కు క్యూ కట్టడంతో మధ్యప్రదేశ్‌లో వందల కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభిస్తోంది. మరో వైపు 44వ, 30వ నంబర్ జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాలకు లెక్కకు మించిన వాహనాలు చేరుకుంటుండడంతో అధికారులు మధ్యప్రదేశ్‌లో రహదారులపైనే వాహనాలను నిలిపి వేస్తున్నట్లు సమాచారం. కుంభమేళాలో రద్దీని పంపించి వేసిన అనంతరమే అక్కడి అధికారుల సమాచారం మేరకు మధ్య ప్రదేశ్ నుంచి వాహనాలను అనుమతిస్తున్నారు. దీంతో జిల్లా నుంచి బయల్దేరిన వారు 18 నుంచి 20 గంటల్లో ప్రయాగ్‌రాజ్‌కు చేరుకోవాల్సి ఉండగా ట్రాఫిక్ జామ్ కారణంగా 40 గంటలకుపైగా సమయం పడుతోంది. మార్గ మధ్యలో సదుపాయాలు అందుబాటులో లేవనే సమాచారం ముందుగానే ఉండటంతో మినీ బస్సుల్లో వెళ్లే జిల్లా వాసులు మార్గమధ్యలో వంటలు వండుకోవడానికి సైతం ఏర్పాట్లు చేసుకొని యాత్రకు బయల్దేరుతున్నారు. మహా కుంభమేళాలో పుణ్య స్నానాలు ఆచరించడం ఈ తరానికి చెందిన తమ అదృష్టంగా భావిస్తూ వ్యయ ప్రయాసలకోర్చి ప్రయాగరాజ్ చేరుకుంటున్నారు.



మహాకుంభమేళాకు వెళ్లే దారిలో మధ్యప్రదేశ్‌లో ట్రాఫిక్ జామ్

సీరియస్‌గా తీసుకోండి

- ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం.. స్థానిక సంస్థల్లో ప్రభావం
- ఏడుగురు మంత్రులకు 42 నియోజకవర్గాల బాధ్యతలు
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



సమీక్షలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

కరీంనగర్ కార్పొరేషన్: 'ఎమ్మెల్సీ ఎన్నిక మనకు ప్రతిష్టాత్మకం. ఈ ఎన్నికల్లో విజయంతోనే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల విజయానికి బాటలు పడతాయి. అలసత్వం వద్దు...సీరియస్‌గా తీసుకోండి. ఆరు నియోజకవర్గాలకో మంత్రి ఇన్‌చార్జిగా ఉంటారు. ఓటింగ్‌కు అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలదే బాధ్యత' అంటూ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ పార్టీ శ్రేణులు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి నామినేషన్ ప్రక్రియలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులతో ఓ హోటల్‌లో అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ ఎన్నిక ఫలితం ప్రభావం చూపుతుందన్నారు. ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యతలను ఏడుగురు మంత్రులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. మరో పదిహేను రోజులే గడువు ఉన్నందున మంగళవారం నుంచి క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని ఉధృతం చేయాలని సూచించారు. పట్టభద్రుల అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి రోల్ మోడల్ అన్నారు. అన్ని రకాల సర్వే చేసి, తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారన్నారు. నరేందర్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా నగరంలో కాంగ్రెస్ పార్టీ భారీ ర్యాలీ నిర్వహించింది. ర్యాలీలో ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి నేతలు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- నోటిఫికేషన్ జారీ అయిన నాటి నుంచి డైలీ రిపోర్టు పంపించాలి
- రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల శిక్షణ తరగతుల్లో కలెక్టర్ హనుమంతు



నిజామాబాద్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్/బోధన్ టౌన్: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్ల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో, బోధన్ డివిజన్ అధికారులకు బోధన్ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం వేర్వేరుగా మొదటి దశ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన నాటి నుంచి ప్రతి రోజూ డైలీ రిపోర్టును పంపించాలని, సంబంధిత వెబ్ సైట్‌లో అభ్యర్థుల నామినేషన్ పత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. నామినేషన్‌ల ప్రక్రియను వీడియో తీయించాలన్నారు. నామినేషన్‌ల ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా పక్కాగా జరిగితే, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా సాగే అవకాశం ఉంటుందన్నారు. నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లను అక్షర క్రమం ఆధారంగా వరుసగా ముద్రించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎన్ని సెట్‌ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామినేషన్ దరఖాస్తులను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.

శిక్షణ తరగతుల్లో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, డీఎల్‌పీవోలు, ఆర్‌వోలు, సహాయ ఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో జిల్లా వాసి



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఆర్యనగర్‌కు చెందిన నిశాంత్–భార్గవి దంపతుల కుమారుడు సహన్ యువనాశ్వ (2వ తరగతి) ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించాడని తెలుగు వెలుగు సమాఖ్య కార్యదర్శి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిత్య హృదయ స్తోత్రం (31 శ్లోకాలు) తడబాటు లేకుండా కేవలం 3.24 సెకన్లలో సహన్‌యువనశ్వ కంఠతా పఠించడంతో ఈ ఘనత సాధించాడన్నారు. జిల్లాతోపాటు తెలంగాణ, యావత్ భారతదేశానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: ప్రొఫెసర్ జి రామిరెడ్డి దూరవిద్య కేంద్రంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రొఫెసర్ జి రామిరెడ్డి దూరవిద్య కేంద్రంలో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకు రెండవ దఫా అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 99126 70252ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

జెడ్పీ సీఈవోగా సాయాగౌడ్

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ జిల్లా పరిషత్ సీఈవోగా సాయాగౌడ్‌ను నియమిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జిల్లాలో ఖాళీగా ఉన్న సీఈవో పోస్టును భర్తీచేసినట్లు సమాచారం. ప్రస్తుతం సాయాగౌడ్ డీఆర్డీఏ పీడీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అక్కడి నుంచి బదిలీపై అతడిని జెడ్పీ సీఈవోగా నియమించినట్లు తెలుస్తోంది. అలాగే ప్రస్తుతం డిప్యూటీ సీఈవోగా ఉన్న సాయన్న అలానే కొనసాగనున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా దేవీదాస్ నామినేషన్

నిజామాబాద్ సిటీ: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీనియర్ జర్నలిస్టు పులగం దేవీదాస్ పోటీచేస్తున్నారు. మెదక్–కరీంనగర్–నిజామాబాద్–ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఈసందర్భంగా పలువురు జర్నలిస్టులు ఆయనను అభినందించారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

- ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ తండా సమీపంలోని జాతీయ రహదారి 44పై ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. అమృతపూర్‌కు చెందిన నలుగురు వ్యక్తులు సోమవారం జక్రాన్‌పల్లిలోని వ్యవసాయ క్షేత్రం నుంచి మక్కసొప్పను ట్రాక్టర్‌పై తీసుకువెళ్తున్నారు. పడకల్ తండా వద్ద వారి ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ ట్రాలీలో కూర్చున్న సిర్పాపల్లి ఒడ్డెన్న(45), రాజేశ్వర్(46)లు అక్కడికక్కడే మృతిచెందారు. ట్రాక్టర్ డ్రైవర్‌తోపాటు ముందు కూర్చున్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మృతులు డిచ్‌పల్లి మండలం అమృతపూర్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తింపు క్రీడా సంఘాలు ఏవీ?

- ఒక్కో క్రీడకు ఒక్కో సంఘం చొప్పున అనుమతి
- జిల్లాలో రెండేసి చొప్పున ఏర్పాటు
- ఇష్టారాజ్యంగా క్రీడల నిర్వహణ

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని క్రీడా సంఘాల నిర్వహణ అంతా అస్తవ్యస్తంగా ఉంది. ఒక్కో క్రీడా విభాగానికి రెండు సంఘాల చొప్పున పుట్టుకొస్తున్నాయి. అనుమతి ఎవరికి ఉందో కూడా చెప్పలేని పరిస్థితిలో అధికారులు, ఒలింపిక్ సంఘం ప్రతినిధులు ఉన్నారు. దీంతో ఏ సంఘానికి గుర్తింపు ఉందో, ఏ సంఘానికి గుర్తింపు లేదో అనే విషయం తెలియక క్రీడాకారులు అయోమయం చెందుతున్నారు. అలాగే ఆయా క్రీడా సంఘాల నిర్వాహకులు క్రీడా పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారుల ప్రతిభను బట్టి కాకుండా అనుకూలంగా, సన్నిహితంగా ఉండే వారిని జిల్లా, రాష్ట్రస్థాయికి పంపిస్తున్నారు. దీంతో



రాష్ట్రస్థాయిలో జిల్లాకు గుర్తింపు అంతగా రావడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

ఆయా క్రీడా సంఘాల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తమకు అనుకూలంగా ఉన్న వారినే రాష్ట్రస్థాయికి పంపిస్తున్నారు. ఇటీవల సీనియర్ జిల్లాస్థాయి కబడ్డీ ఎంపికలు ముప్కాల్‌లో నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులకు వారం పాటు శిక్షణ క్యాంపు నిర్వహించాల్సి ఉండగా, ఒక్క రోజులోనే మమ అనిపించేసి ఇంటర్, డిగ్రీ చదివే క్రీడాకారులను రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు పంపారు. వాస్తవానికి పీజీ ఆపై చదివిన క్రీడాకారులను సీనియర్ టోర్నీకి పంపించాలి. అలా కాకుండా ఇష్టారాజ్యంగా ఎంపికలు నిర్వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే రాష్ట్ర సీనియర్ మహిళ టీమ్‌కు కోచ్‌గా కబడ్డీ కోచ్, వ్యాయామ ఉపాధ్యాయులను పంపించాలి. అలా కాకుండా డిగ్రీ చదివే క్రీడాకారుడిని పంపడంలో ఆంతర్యమేమిటో తెలియాల్సి ఉంది. ఇలానే ఉషు, హ్యాండ్‌బాల్, తైక్వాండో క్రీడల్లో సైతం జరుగుతోంది. ఇటీవల సీఎం కప్ టోర్నీకి సైతం హాకీ క్రీడాకారుల ఎంపిక అంతా గందరగోళంగా జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు.

పర్యవేక్షణ గాలికి..

పర్యవేక్షణ చేయాల్సిన జిల్లా యువజన క్రీడల అధికారి తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని చర్చించుకుంటున్నారు. ఏ క్రీడ సంఘానికి అనుమతి ఉందో కూడా చెప్పకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇక ఒలింపిక్ సంఘం ప్రతినిధులు సైతం ఉన్నామా లేదా అన్నట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో క్రీడలు, క్రీడాసంఘాల పనితీరుపై పర్యవేక్షణ లేకపోవడంతో తమకు అన్యాయం జరుగుతోందని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏ క్రీడా సంఘానికి అనుమతి ఉందో తేల్చి, ఒక క్రీడకు ఒక సంఘం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సభ్యుల మధ్య గొడవలతో..

జిల్లాలో క్రీడా సంఘాలు 42 ఉన్నాయి. ఇందులో కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఉషు, తైక్వాండో, యోగా, వాలీబాల్ తదితర క్రీడా సంఘాలు రెండేసి చొప్పున ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఒక్కో క్రీడకు ఒక్క యూనియన్ మాత్రమే ఉండాలి. అలా కాకుండా జిల్లాలో యూనియన్‌లలో ఉన్న సభ్యుల మధ్య గొడవలు రావడంతో ప్రత్యేకంగా సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. వివిధ రకాల క్రీడల్లో జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి క్రీడాకారులను టోర్నమెంట్‌కు తీసుకెళుతున్నారు. ఇందులో ఏ సంఘానికి అనుమతి ఉందో, ఎవరి సర్టిఫికెట్‌కు అర్హత ఉందో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది.

బోగస్ సంఘాలపై చర్యలు..

జిల్లాలో బోగస్ సంఘాలు ఏర్పాటు చేసుకొని క్రీడాకారులను జిల్లాస్థాయిలో ఎంపికలు చేసి, రాష్ట్రస్థాయికి పంపినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం. రాష్ట్రస్థాయి టోర్నీకి వెళ్లే జట్లకు కోచ్‌లుగా సీనియర్ వ్యాయమ ఉపాధ్యాయులను, కోచ్‌లను మాత్రమే పంపాలి. జూనియర్ క్రీడాకారులను పంపినట్లు తెలిస్తే చర్యలు ఉంటాయి.

– బొబ్బిలి నర్సయ్య, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి

నిబంధనలు పాటించాల్సిందే..

ఆయా క్రీడా సంఘాల నిర్వాహకులు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి టోర్నీకి క్రీడాకారులను తీసుకెళితే స్పోర్ట్స్ అథారిటీ, ఒలింపిక్ సంఘం నియమనిబంధనలు పాటించాల్సిందే. నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా ఎంపికలు చేసినా, క్రీడాకారులకు అన్యాయం చేసినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– ముత్తెన్న, డీవైఎస్‌వో

వృద్ధులను ప్రేమతో ఆదరించాలి

- త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి
- ఆర్మూర్ నియోజకవర్గంలో పర్యటన

పెర్కిట్/ఆర్మూర్(ఆర్మూర్)/మాక్లూర్: పిల్లల భవిష్యత్ కోసం తపిస్తూ గడిపిన తల్లిదండ్రులను మలిదశ వృద్ధాప్యంలో ప్రేమతో ఆదరించాలని త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని లాలన వృద్ధాశ్రమాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఇటీవల స్వర్గస్తులైన ఆశ్రమ వ్యవస్థాపకుడు గడ్డం రాజరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత తరం వారు పనుల్లో పడి వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వారు బాధ్యతాయుతంగా వ్యవహరించినపుడే అందరికి సౌకర్యంగా ఉంటుందన్నారు. అలాగే ఆర్మూర్‌లోని బీజేపీ సీనియర్ నాయకుడు లోక భూపతిరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. అనంతరం నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో గవర్నర్ పూజలు నిర్వహించారు.



మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

అపురూప వేంకటేశ్వర ఆలయంలో పూజలు..

మాక్లూర్ మండలంలోని అడవి మామిడిపల్లి శివారులో గల అపురూప వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. దైవదర్శనం అనంతరం బీజేపీ నాయకులు ఒక్కొక్కరుగా గవర్నర్‌ను సన్మానించారు. అంతకుముందు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేకంగా గౌరవ వందనంతో ఆయనకు స్వాగతం పలికారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, విజయ్ విద్యా సంస్థల చైర్మన్ అమృతలత, లాలన వృద్ధాశ్రమం చైర్మన్ సునీతరెడ్డి, టక్కరి హన్మంత్‌రెడ్డి, పెద్దోళ్ల గంగా రెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, పుప్పాల శివరాజ్, బద్దం లింగారెడ్డి, కంచెట్టి గంగాధర్, మదారి మమతా రాజేశ్వర్, గంగోని సంతోష్, శరత్, చింత ప్రవీణ్ రెడ్డి, ముప్ప గంగారెడ్డి, రచ్చ సుదర్శన్, శ్రీకాంత్, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.



ఆలయంలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

దైవ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



నగరంలో వారాహిమాత ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్వామీజీ

- హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి
- నగరంలో వారాహిమాత ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సనాతన ధర్మాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ దైవకార్యాల్లో భాగస్వాములు కావాలని హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతిస్వామి పిలుపునిచ్చారు. నగరంలోని అమ్మనగర్‌లో వ్యాపారవేత్త మంచాల జ్ఞానేందర్‌గుప్తా ఆధ్వర్యంలో నిర్మించనున్న వారాహిమాత ఆలయానికి సోమవారం విద్యారణ్యభారతి స్వామి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన పాటిస్తే సమాజంలో సమస్యలు తేలికగా పరిష్కరించుకోవచ్చన్నారు. వారాహి మాత ఆలయాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చిన జ్ఞానేందర్‌గుప్తాను అభినందించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మినారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్, రాష్ట్ర నాయకుడు మాదాసు స్వామియాదవ్, అమ్మనగర్ అధ్యక్షుడు నరేష్, ఉపాధ్యక్షుడు పంచరెడ్డి శ్రీకాంత్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న స్వామీజీ, అర్చకులు

తెయూలో ఆరోగ్య విద్యను ప్రోత్సహిస్తాం

- వీసీ యాదగిరి రావు
- సూర్య ఆరోగ్య సంస్థతో ఎంవోయూ

తెయూ(డిచ్‌పల్లి): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) మార్గదర్శకాలకు కట్టుబడి విశ్వవిద్యాలయంలో ఆరోగ్య విద్య, కౌన్సెలింగ్ సేవలు, ఫిట్‌నెస్ కార్యకలాపాలను ప్రోత్సహిస్తామని తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరి రావు తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ, సూర్య ఆరోగ్య సంస్థ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఈసందర్భంగా సోమవారం ఒప్పంద పత్రాలపై తెయూ వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ యాదగిరి, సూర్య హెల్త్ ఆర్గనైజేషన్ చైర్మన్ చేకూరి ఉదయ సూర్యభగవాన్, రాజేంద్రకుమార్ విక్రమ్ సంతకాలు చేశారు. వీసీ మాట్లాడుతూ.. ఆరోగ్య విద్య, నిర్మాణాత్మక సంస్కరణ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మానసిక, భావోద్వేగ, శారీరక శ్రేయస్సును పెంపొందించడమే ఈ భాగస్వామ్య లక్ష్యం కావాలన్నారు. సంస్థ చైర్మన్ ఉదయ సూర్య భగవాన్ మాట్లాడుతూ.. అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా ప్రజారోగ్యం, శ్రేయస్సు మెరుగుపర్చడానికి తమ సంస్థ కట్టుబడి ఉంటుందన్నారు. సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, ప్రొఫెసర్ సీహెచ్ ఆంజనేయులు, సంస్థ సభ్యులు రవితేజ, ఆనంద్, రాజేశ్వరి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



సూర్య ఆరోగ్య సంస్థ ప్రతినిధులతో ఎంవోయూ కుదుర్చుకుంటున్న తెయూ వీసీ యాదగిరి రావు

కమనీయం.. సీతారాముల కల్యాణం

- కొనసాగుతున్న డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం బ్రహ్మోత్సవాలు
- పాల్గొన్న రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ రమేశ్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌గుప్తా దంపతులు సీతారాముల వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ప్రతియేటా మాఘ శుద్ధ త్రయోదశి రోజున సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధానార్చకులు సుమిత్‌శర్మ దేశ్‌పాండే నేతృత్వంలో యాగ్నికులు కాండూరి భార్గవచారి, అర్చకులు గోపాలాచార్య, పంకజాచార్య, ఆర్యన్ పాండే, వైభవ్, కాకర్ల ప్రవీణ్ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే యంత్ర హోమం, బలిహరణం, అశ్వసేవ కార్యక్రమాలను నిర్వహించారు. నేడు గరుడ సేవ నిర్వహించనున్నారు. అంతకుముందు డిచ్‌పల్లి ఖిల్లా రామాలయాన్ని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ రమేశ్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి సందర్శించారు. ఉత్సవ విగ్రహాలను ఆలయ కమిటీ నిర్వాహకులతో కలిసి వారు కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, డైరెక్టర్లు, సొసైటీ మాజీ చైర్మన్ గజవాడ జైపాల్, గజవాడ చిన్నయ్య, వీడీసీ ప్రతినిధులు బూస సుదర్శన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



సీతారాముల ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపానికి తీసుకువస్తున్న రమేశ్‌రెడ్డి, భూపతిరెడ్డి, భక్తులు

ఖిల్లా రామాలయం అభివృద్ధికి కృషి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం అభివృద్ధికి కృషిచేస్తానని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ రమేశ్‌రెడ్డి అన్నారు. వైభవంగా కొనసాగుతున్న ఆలయ బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఆయన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. అలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆయనకు ఆలయ విశిష్టత, చారిత్రక నేపథ్యాన్ని తెలియజేశారు. రామాలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, వీడీసీ సభ్యులు వారికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, రామడుగు ప్రాజెక్టు, గుండారంలోని లక్ష్మాపూర్ లోని అనంత పద్మనాభస్వామి ఆలయాలను కలిపి టూరిజం హబ్‌గా మార్చి పర్యాటకులు భారీ సంఖ్యలో వచ్చే విధంగా చూస్తామన్నారు. డిచ్‌పల్లి రామాలయం చెరువుతోపాటు రామడుగు ప్రాజెక్టులో బోటింగ్ సౌకర్యం కల్పించాలని రమేశ్‌రెడ్డిని కోరారు. రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి టూరిజంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ తారచంద్‌నాయక్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, మునిపల్లి సాయరెడ్డి పాల్గొన్నారు.



రమేశ్‌రెడ్డి, భూపతిరెడ్డిలకు వినతిపత్రం అందజేస్తున్న వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు

శాస్త్రీయంగానే కులగణన

- ప్రతిపక్షాల రాద్ధాంతం సరికాదు
- రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్



నిజామాబాద్ నాగారం: కులగణన శాస్త్రీయంగా జరిగిందని, అయినా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం సరికాదని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. నగరంలోని పద్మశాలి కల్యాణ మండపంలో సోమవారం జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈసందర్భంగా అనిల్ నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేనేత రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. త్వరలోనే చేనేత తదితర సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎంపీగా అర్వింద్‌ను గెలిపించినా ఆయన పద్మశాలీలకు చేసింది ఏమీ లేదన్నారు. మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్ మాట్లాడుతూ.. సాంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక పద్మశాలి సమాజం అని అన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు దీకొండ యాదగిరి, బిజ్జు దత్తాద్రి, పుల్గం హన్మాండ్లు, గుజ్జ రాజేశ్వరి, గుజ్జేటి వెంకటనర్సయ్య, రాపెల్లి గురుచరణం, గుద్ల చంద్రబాగ, బల్ల లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇంటికి వెళ్లే వరకు టీచర్ ఉండాలి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లే వరకు ప్రతి రోజూ ఒక టీచర్ అందుబాటులో ఉండాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల సమయం ముగియగానే టీచర్లందరూ వెళ్లిపోవడం, విద్యార్థులను తీసుకు వెళ్లేందుకు వారి తల్లిదండ్రులు, సహాయకులు ఆలస్యంగా రావడం కారణంగా కొందరు విద్యార్థులు పాఠశాలల్లోనే ఉండిపోతున్నారు. ఇటీవల ఓ విద్యార్థిని పాఠశాలలో ఉండగా కుక్కలు దాడి చేశాయని, ఇటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా పాఠశాలల్లో ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు విద్యార్థులు ఇంటికి వెళ్లే వరకు అందుబాటులో ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు ప్రతిరోజూ పాఠశాలలో ఒక టీచర్ ఉండాలని డీఈవో అశోక్ ఒక ప్రకటనలో ఆదేశించారు.

గల్లంతైన మిషన్ భగీరథ ఉద్యోగి మృతదేహం లభ్యం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రం శివారులోని నిజాంసాగర్ ప్రధాన కాలువలో గల్లంతైన మిషన్ భగీరథ ఇంట్రాసెక్షన్ హెల్పర్ కర్రె విఠల్ (44) మృతదేహం సోమవారం ఉదయం బూర్గుల్ శివారులోని డిస్ట్రిబ్యూటరీ–3 వద్ద లభ్యమైనట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన విఠల్ గ్రామ రెవెన్యూ వీఆర్‌ఏగా పని చేసేవాడు. గత ప్రభుత్వం వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ పలు ప్రభుత్వ శాఖల్లో బదిలీ చేయగా అతడు ఎల్లారెడ్డి మండల మిషన్ భగీరథ కార్యాలయంలో హెల్పర్‌గా చేరాడు. రోజుమాదిరిగానే ఆదివారం మహమ్మద్ నగర్ శివారులోని మంజీరా ప్రధాన కాలువ వద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు విఠల్ వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. అధికారులు నీటి విడుదలను నిలిపివేయించి కాలువలో అతడి ఆచూకీ కోసం రాత్రి వరకు గాలించారు. కానీ సోమవారం ఉదయం మృతదేహం లభ్యం అయ్యింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



కర్రె విఠల్ (ఫైల్)

వరదకాలువలో ఛత్తీస్‌గఢ్ వాసి..


బాల్కొండ: మండలంలోని బస్సాపూర్ గ్రామ శివారు లోగల వరద కాలువలో ఆదివారం ప్రమాదవశాత్తు గల్లంతైన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బీర్‌సింగ్ మారాబి(40) మృతదేహం సోమవారం మధ్యాహ్నం లభ్యమైంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాలు ఇలా.. బస్సాపూర్‌లో ఓ మేస్త్రీ వద్ద అతడు తాపీ పని చేసేవాడు. తన సెల్‌ఫోన్ మరమ్మతుల కోసం బీర్‌సింగ్ మారాబి బాల్కొండ వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తూ వరద కాలువలో పడి గల్లంతయ్యాడు. స్థానిక మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టగా ఎక్కడ పడిపోయాడో అక్కడే మృత దేహం లభ్యమైంది. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



బీర్‌సింగ్ (ఫైల్)

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

నవీపేట: మండలంలోని అబ్బాపూర్ (బి) గ్రామానికి చెందిన క్లెం అభిషేక్(17) అనే ఇంటర్ విద్యార్థి కొన్నిరోజుల కిందట ఆత్మహత్యకు యత్నించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని ఓ కళాశాలలో అభిషేక్ గతేడాది మొదటి సంవత్సరంలో ఫెయిల్ అయ్యాడు. దీంతో అతడిని మళ్లీ అదే కాలేజీలో మొదటి సంవత్సరంలో చేర్పించారు. చదువుపై ఇష్టం లేదని.. చదువుకోనని పలుమార్లు తండ్రి సాయిలు ఎదుట అతడు రోదించిన పట్టించుకోలేదు. ఈక్రమంలో చదువుపై ఇష్టం లేక జీవితంపై విరక్తి చెంది అతడు గత నెల 27న పురుగుల మందు తాగి వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చేర్పించారు. కానీ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



అభిషేక్ మృతదేహం

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



సిరికొండ: మండలంలోని కొండూర్ శివారు లోగల వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బాల్‌సింగ్ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సోమవారం రెవెన్యు ఇన్‌స్పెక్టర్ గంగరాజం పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ట్రాక్టర్లు సర్పల్లి తండాకు చెందిన మాలావత్ బాలాజీ, మాలావత్ భాస్కర్‌లకు చెందినవన్నారు.

'చిలుకూరు' అర్చకుడిపై దాడి కేసులో బోధన్ వాసి అరెస్టు

ఖలీల్‌వాడి: చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన కేసులో జిల్లాలోని బోధన్‌కు చెందిన సాయిలు అలియాస్ సాయినాథ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని రాజేంధర్‌నగర్ పోలీసులు రెండు రోజుల క్రితం అతడిని అదుపులోకి తీసుకున్నారు. సాయినాథ్ ప్రస్తుతం రామరాజ్యం సంస్థ జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. 2022 నుంచి జిల్లాలో రామరాజ్యం సంస్థ కోసం పని చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

కామారెడ్డి క్రైం: పట్టణ శివారులోని దేవునిపల్లి పరిధిలోగల విద్యుత్ నగర్ కాలనీలో కొనసాగుతున్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. కాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో దేవునిపల్లి పోలీసులు సోమవారం సాయంత్రం అక్కడికి వెళ్లారు. ముగ్గురు విటులను, ఓ మహిళను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.